క్లుప్తంగా

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



గొల్లపాలెంలో విద్యార్థులకు సైకిళ్లు అందిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు, ఎంపీటీసీ అనంతలక్ష్మి

మలికిపురం: మండలంలోని గొల్లపాలెం పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన పలువురు దాతలు సమకూర్చిన సైకిళ్లను పంపిణీ చేశారు. ఆదిత్య ప్రసన్న, గుండుమేను రామకృష్ణారావు, కిలారపు వీర్రాజు, నేమాని జ్యోతి బాబు, గుండుమేను హనుమంతరావులు సమకూర్చిన ఆరు సైకిళ్లను విద్యార్థులకు అందించారు. కార్యక్రమానికి హెచ్‌ఎం యింజేటి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా సర్పంచ్ మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మట్ట అనంత లక్ష్మి, ఉప సర్పంచ్ ఎలుమర్తి బాబూజీ, వార్డు సభ్యులు నాగళ్ళ బేబీ, నల్లి దాసు, గుండుమేను నాగేశ్వరరావు గుండుమేను సూరిబాబు, ముస్కూడి యేసురత్నం, నాగళ్ళ బాబ్జి, కందుల నరసింహారావు పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థిని ఎంపిక



గంధం రిషిక స్వరిణి

ఆలమూరు: మండలంలోని చెముడులంకలోని నేతాజీ పబ్లిక్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని గంధం రిషిక స్వరిణి ప్రతిష్టాత్మకమైన జవహర్ నవోదయకు ఎంపికైంది. మడికి గ్రామానికి చెందిన ఆ విద్యార్థిని స్కూల్ యాజమాన్యం ప్రోద్బలంతో జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబర్చింది. దీంతో ఇటీవల వెలువడిన ఫలితాల్లో మెరుగైన ర్యాంకు సాధించడంతో కాకినాడ జిల్లాలోని పెద్దాపురంలోని నవోదయ పాఠశాలలో చదివేందుకు సీటు ఖరారైంది. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ ఉచిత విద్యను అభ్యసించనుంది. విద్యార్థిని స్వరిణి తల్లిదండ్రులైన సత్తిబాబు, శిరీషతో పాటు స్కూల్ యాజమాన్యాన్ని పలువురు అభినందించారు.

230 మందికి ఉచిత వైద్య పరీక్షలు



మామిడికుదురులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్వర్ణలత

మామిడికుదురు: నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత ఆధ్వర్యంలో మామిడికుదురులో శుక్రవారం స్థానికులకు ఉచిత వైద్య సేవలందించారు. సుమారు 230 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ప్రస్తుత సీజన్‌లో వైరల్ జ్వరాల ప్రభావం ఎక్కువగా ఉందని, ప్రజలు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వర్ణలత సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ ఒ.రోషిణి, హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్, ఏఎన్‌ఎం కె.దుర్గాదేవి, ఆశ కార్యకర్తలు కె.లక్ష్మీకుమారి, డి.మాధురి, డీఈఓ జె.సత్యనారాయణ, ఫైలెట్ ఎం.జీవన్ పాల్గొన్నారు.


చిరంజీవి సేవాభావం యువతకు ఆదర్శం



తాటిపాకలో మొక్క నాటుతున్న చిరంజీవి అభిమానులు

రాజోలు: పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి సేవాభావం యువతకు ఆదర్శంగా నిలుస్తోందని రాజోలు తాలూకా చిరంజీవి అభిమాన సంఘ నాయకులు అన్నారు. శుక్రవారం తాటిపాక ఉన్నత పాఠశాల ఆవరణలో చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా మొక్కలు నాటారు. రాజోలు తాలూకా చిరంజీవి, పవన్ కల్యాణ్ అభిమాన సంఘాల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు గుండాబత్తుల తాతాజీ తెలిపారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీను, డాక్టర్ రాపాక రమేష్‌బాబు, నాయకుడు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంకలో అక్రమంగా ట్రాక్టర్‌పై ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో స్థానిక వీఆర్వో కొల్లు నరసింహమూర్తి తన సిబ్బందితో గురువారం రాత్రి పట్టుకుని అయినవిల్లి పోలీసులకు అప్పగించారు. అయినవిల్లి పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి తదుపరి చర్యల కోసం తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించారు. మొదటి తప్పుకింద ట్రాక్టర్ యజమాని కుంచే సత్యనారాయణ నుంచి రూ.3 వేలు అపరాధ రుసుం వసూలు చేసినటుల్ ట్రాక్టర్‌ను వదిలి పెట్టినట్లు తహసీల్దార్ శ్రీవల్లి తెలిపారు.

ఇదేం దారిద్ర్యం

- ప్రమాదాలకు నిలయంగా అంబాజీపేట–పి.గన్నవరం రహదారి
- తరచూ ప్రమాదాలు..
- గాయాలపాలవుతున్న ప్రయాణికులు



పోతవరం వద్ద కుంగిన రహదారిలో ఇబ్బంది పడుతున్న వాహనాలు



పి.గన్నవరంలో అధ్వానంగా మారి చెరువును తలపిస్తున్న రహదారి

పి.గన్నవరం: అంబాజీపేట–పి.గన్నవరం రహదారి పూర్తిగా ధ్వంసమై ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. వర్షం కురిస్తే పలు చోట్ల ఈ రహదారి చెరువులను తలపిస్తోంది. ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక ద్విచక్ర వాహనదారులు వాటిలో పడి గాయాల పాలవుతున్నారు. దీంతో ప్రయాణికులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పి.గన్నవరం నుంచి అంబాజీపేట వరకూ 6.6 కిలోమీటర్ల మేర ఉన్న రహదారిని ఏజీ రోడ్డుగా పిలుస్తారు. ఈ రహదారి మీదుగా నిత్యం వేలాది వాహనాలు వెళ్తుంటాయి. అయితే గత కొన్నేళ్లుగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో గుంతల్లో పడి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. ఇటీవల మాచవరం గ్యాస్ కంపెనీ వద్ద మోటారు సైకిలు గుంతలో పడి పల్టీ కొట్టడంతో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. అలాగే పలువురు ప్రయాణికులు గాయాల పాలయ్యారు. గుంతల్లో పడి వాహనాలు కూడా త్వరితగతిన పాడై రిపేర్‌కు వస్తున్నాయని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో జి.పెదపూడి, ఊడిమూడి గ్రామాల నుంచి అంబాజీపేటకు వెళ్లే భారీ వాహనాలు.. పి.గన్నవరం సెంటర్‌కు రాకుండా బెల్లంపూడి–నరేంద్రపురం గ్రామాల మీదుగా మరో రహదారిలో వెళ్తున్నాయి. దీంతో ఏజీ రోడ్డులో రద్దీ కూడా తగ్గింది. అలాగే పోతవరం గణేష్‌నగర్‌కు సమీపంలో డ్రెయిన్ వైపున ఈ రహదారి సుమారు 350 మీటర్ల మేర కుంగిపోయింది. ఆ ప్రాంతంలో రహదారిని గతంలో ఎన్నిసార్లు పటిష్టం చేసినా మళ్లీ దిగిపోతుంది. ఇక్కడ గతంలో జరిగిన ప్రమాదాల్లో పలువురు మృతి చెందారు. ఈ ప్రాంతంలో డ్రెయిన్ వైపున కాంక్రీటు రక్షణ గోడ నిర్మించి, పి.గన్నవరం నుంచి అంబాజీపేట వరకూ రహదారిని ఆధునీకరించేందుకు గత ప్రభుత్వం రూ.8 కోట్లు మంజూరు చేసింది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కూడా ఈ రహదారి అభివృద్ధి పనులకు పి.గన్నవరంలో భూమి పూజ చేశారు. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తగు చర్యలు తీసుకుని ఈ రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజలు, ప్రయాణికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వాహనాలు పాడవుతున్నాయి.



పి.గన్నవరం–అంబాజీపేట రహదారి పూర్తిగా పాడైపోయింది. దీంతో తరచూ ప్రమాదాలు జరిగి పలువురు గాయాల పాలవుతున్నారు. ఈరహదారిపై ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంతో వెళ్తున్నాం. గుంతల వల్ల వాహనాలు పాడవుతున్నాయి. తక్షణమే రహదారిని ఆధునీకరించాలి.

– మామిడిపల్లి చైతన్యకుమార్, పి.గన్నవరం

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



పి.గన్నవరం–అంబాజీపేట రహదారిపై ప్రయాణించేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. గుంతల వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి తోడు రహదారిపై దుమ్ము లేవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పి.గన్నవరం నుంచి అంబాజీపేట వెళ్లేందుకు 20 నిమిషాల సమయం పడుతోంది.

– పితాని వెంకట సాయి మణికంఠ, నరేంద్రపురం

వరముల నొసగవే వరలక్ష్మీ..

- భక్తిశ్రద్ధలతో మహిళల వ్రతం
- సామూహిక వ్రతాలకు విశేష స్పందన



అప్పనపల్లి పద్మావతికి గాజులతో విశేషాలంకరణ



చింతలూరులోని నూకాంబిక ఆలయంలో నిర్వహించిన పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వేకువజామునే పుణ్యస్నానమాచరించిన భక్తులు ఆయా గ్రామాల్లోని ఆలయాలకు చేరుకుని అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని చెముడులంక ధనలక్ష్మి, చొప్పెల్ల శ్రీకనక మహాలక్ష్మి తదితర ఆలయాలతో పాటు దుర్గామాత ఆలయాలు మహిళ భక్తులతో కిటకిటలాడాయి. చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి నేతృత్వంలో దేవదాయశాఖ ఉచితంగా పూజ సామగ్రిని సమకూర్చి నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు విశేష స్పందన లభించింది. ఆయా ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ఘనంగా వరలక్ష్మి వ్రత పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలోని ఉపాలయంలో కొలువైన రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి సన్నిధిలో శ్రావణ మాసం రెండో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ కుంకుమ పూజలు దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ పూజలను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ నేతృత్వంలో స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు మహిళలతో ఈ పూజలు చేయించారు. అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులకు ఎటువంటి పూజా రుసుము లేకుండా దేవస్థానం తరపున అమ్మవారి రూపు, పూజా సామగ్రి ఉచితంగా సిబ్బంది పంపిణీ చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్ దర్శనం, ప్రసాద వితరణ చేసి, నిత్యాన్నదాన పథకంలో భోజన వసతి కల్పించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి పాల్గొన్నారు.

గాజులతో విశేషాలంకరణ

మామిడికుదురు: శ్రావణ మాసం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా లోక కల్యాణంతో పాటు మహిళల సౌభాగ్యం కోరుతూ అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలోని పద్మావతికి సహస్ర కుంకుమార్చన ఘనంగా జరిపించారు. పాశర్లపూడిబాడవకు చెందిన గంధం గోపాల్, లహరి దంపతులతో అమ్మవారికి మట్టి గాజులతో విశేషాలంకరణ జరిగింది. ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చక గొడవర్తి జగదీష్ అమ్మవారికి గాజుల అలంకరణతో పాటు సహస్ర కుంకుమార్చన జరిపించారు. ఆలయ ఈఓ గ్రంధి మాధవి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని 17 గ్రామాల్లో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు వేకువ జామునే గౌతమీ, వశిష్టా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆయా ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు పండ్లు, పూలు, మామిడాకులతో అలంకరించి వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకోగా పలువురు తమ ఆనవాయితీ ప్రకారం వరలక్ష్మీ దేవీని అలంకరించి వ్రతం చేసుకున్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో కొలువైన అన్నపూర్ణదేవి సమేత విశ్వేశ్వరస్వామివారి ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు అల్లవరపు సూరిబాబు, బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి సహస్ర కుంకుమ పూజలు జరిపారు. అనంతరం అన్నపూర్ణదేవి అమ్మవారిని వివిధ పుష్పాలతో నూతన వస్త్రాలతో కనుల విందుగా ఆలయ అర్చకులు అలంకరించారు. మహిళలు లలిత సహస్ర నామార్చన అలపించారు. అలాగే అయినవిల్లి పెద్దపేటలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అయినవిల్లి గ్రామ సర్పంచ్ కాకర శ్రీనివాస్ తదితరులు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిపారు.



అంతర్వేది రాజ్యలక్ష్మీ తాయారు అమ్మవారి సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



అయినవిల్లిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఈతకోట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మండలంలోని దేవరపల్లి, మట్టలదొడ్డి, కేతరాజుపల్లి, చెల్లిరేవు, వెదిరేశ్వరం, కోసూరి నగర్, గరువు, ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాబ్ మేళాలో 86 మంది ఎంపిక



ఉద్యోగ నియామక పత్రాలతో విద్యార్థులు

అమలాపురం టౌన్: వివిధ కంపెనీల వారు స్థానిక శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 86 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయి. టీసీఎస్, బీటీఎస్, దివాస్ తదితర కంపెనీలు నిర్వహించిన జాబ్ మేళాలో ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు కంపెనీల ప్రతినిధులు నియామకపత్రాలు అందించారు. కొత్తగా ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కేవీ ఆర్‌ఎన్ నరసింహారావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఏఓ కరాటం ప్రవీణ్, అధ్యాపకులు అభినందించారు.

నేడు ప్యానల్ కమిటీల ఎన్నికలు

అమలాపురం టౌన్: మున్సిపల్ కౌన్సిల్‌లో ప్యానల్ కమిటీల ఎన్నికలకు శనివారం శ్రీకారం చుడుతున్నారు. ఇటీవల జరిగిన అనేక కౌన్సిల్ సమావేశాల్లో పలువురు కౌన్సిలర్లు ప్యానల్ కమిటీలు ఎప్పుడు వేస్తారని నిలదీసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్యానల్ కమిటీల్లో భాగమైన కాంట్రాక్ట్, ఉపాధ్యాయేతర పోస్టుల నియామక కమిటీని ఎన్నుకునేందుకు కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ఓ ప్రకటనతో తెలిపారు. కాంట్రాక్ట్, ఉపాధ్యాయేతర పోస్టుల నియామక కమిటీలకు సంబంధించి ఒక్కో కమిటీలో ఏడుగురు సభ్యులు ఉండేలా కౌన్సిలర్లు ఎన్నుకోవాల్సి ఉందని ఆమె తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్ల సర్వే కమిటీలో సభ్యులుగా నియమించడానికి మాన్యువల్ స్కావెంజర్ల వెల్ఫేర్ స్వచ్ఛంద సంస్థల నుంచి, పారిశుధ్య కార్మికుల కమ్యూనిటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతునట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి ఎం.జ్యోతి లక్ష్మీదేవి తెలిపారు. ఈ నెల 20లోపు దరఖాస్తులు చేయాలని ఓ ప్రకటనలో సూచించారు. ఇతర వివరాలకు సెల్ నంబరు 99086 95010లో సంప్రదించాలని కోరారు.

అంటువ్యాధులను నిర్మూలించాలి



కలవచర్లలో చెత్తను పరిశీలిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పడం ద్వారా అంటువ్యాధుల నివారణ సాధించవచ్చని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ కోరారు. డ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమికీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. ఏవీపీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

ఉత్తమ అవార్డులు స్వీకరణ





ఉత్తమ అవార్డును అందుకుంటున్న హెల్త్ విజిటర్ ఉమ, నల్లి ప్రకాష్

ఆలమూరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉత్తమ అవార్డులు వరించాయి. పెదపళ్ల పీహెచ్‌సీలో హెల్త్ విజిటర్‌గా పనిచేస్తున్న పి.ఉమ, ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఎం.బాలాస్వామి, తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్ఓగా పనిచేస్తున్న సీహెచ్ సత్యనారాయణ ఉత్తమ అవార్డులకు ఎంపికైన వారిలో ఉన్నారు. ఈనెల 15న అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెటి సుభాష్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

ఉత్తమ ఉద్యోగిగా సీనియర్ అసిస్టెంట్

మలికిపురం: స్థానిక సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వమిస్తున్న నల్లి ప్రకాష్‌కి ఆగస్టు 15 సందర్భంగా ఉత్తమ ఉద్యోగ అవార్డు లభించింది. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా మలికిపురం మండల దస్తావేజు లేఖర్లు శుక్రవారం అభినందించారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి

కొత్తపేట: స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశం కోసం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, ఐక్యతకు ఎంతగానో పాటుపడిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం గౌతు లచ్చన్న జయంతి పురస్కరించుకుని స్థానిక ఆర్‌ఎస్ కన్వెన్షన్ హాలు వద్ద ఆయన విగ్రహానికి రెడ్డి సుబ్రహ్మణ్యం, పలువురు బీసీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సడన్ బ్రేక్

- అర్థాంతరంగా నిలిచిన అమలాపురం బస్ టెర్మినల్ పనులు
- ఆరు నెలలైనా అతీగతీ లేని నిర్మాణం
- రూ.45 కోట్ల అంచనా వ్యయంతో జరిగిన శంకుస్థాపన
- కొత్త పాలకుల నిర్లక్ష్యంపై ప్రజల్లో అసంతృప్తి



ప్రయాణికులతో ఉన్న అమలాపురం బస్ కాంప్లెక్స్

అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో కోనసీమ ప్రతిష్ఠను ఇనుమడించేలా రూపకల్పన చేసిన నూతన బస్ కాంప్లెక్స్ టెర్మినల్ నిర్మాణంలో ఇసుమంతైనా పురోగతి లేదు. విజయవాడలో మాదిరిగా అత్యాధునిక వసతులతో ప్రతిపాదించిన నూతన బస్ కాంప్లెక్స్ టెర్మినల్ నిర్మాణానికి ఈ ఏడాది ఫిబ్రవరి 14న అప్పటి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. అమలాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో సుమారు రూ 45 కోట్ల అంచనా వ్యయంతో ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో అత్యాధునిక స్టేషన్, బస్సు కాంప్లెక్స్ టెర్మినల్ నిర్మించాల్సి ఉంది. అప్పటి ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్. ద్వారకా తిరుమలరావు, జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.గోపీనాథ్‌రెడ్డి వీటికి శంకుస్థాపన చేశారు. జిల్లా స్థాయికి తగ్గట్టుగా అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసేలా అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణం కోసం తొలి దశలో రూ.5 కోట్లు రాష్ట్ర రవాణా శాఖ కేటాయించింది. ప్రస్తుతం ఉన్న కాంప్లెక్స్ భవనాన్ని తొలగించి, దాని స్థానే అత్యాధునిక బస్ టెర్మినల్‌ను 24 ప్లాట్‌ఫారాలతో పాటు, మూడు అంతస్తుల కమర్షియల్ కాంప్లెక్స్ బ్లాకుల నిర్మాణానికి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో టెండర్లు పిలిచారు. తొలి దశలో మంజూరైన రూ.5 కోట్లతో గ్రౌండ్ ఫ్లోర్ బస్ టెర్మినల్ పూర్తి చేసి, అందుబాటులోకి తెచ్చేందుకు నిర్ణయించారు. మూడు అంతస్తులను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో కమర్షియల్‌గా చేస్తున్నట్టు అప్పటి ఏపీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. మంజూరైన రూ.5 కోట్లతో పాటు, మరో రూ.3 కోట్లు వెచ్చించి గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తి చేస్తామని అప్పట్లో తెలిపారు. తొలి రెండు ఫ్లోర్లకు పీపీపీ విధానంలో బిడ్డింగ్ కాల్ ఫర్ చేసి, నిర్మాణ ప్రతిపాదనలు చేశారు. కమర్షియల్ కాంప్లెక్స్‌ను డిమాండ్‌కు అనుగుణంగా నిర్మించాలని ప్రతిపాదించారు.

బస్టాండ్‌కు ముంపు సమస్య

ఆవరణ అంతా పల్లంగా ఉండటంతో వర్షం వస్తే బస్టాండ్‌లో ముంపు సమస్య తలెత్తుతోంది. ముంపు నీరు బయటకు వెళ్లిందుకు అవుట్‌లెట్ లేకపోవడంతో ముంపు సమస్య తీవ్రంగా ఉంటోంది. భారీ వర్షాలకు ముంపు సమస్య వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆవరణ మెరక చేసి, డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. తొలిదశలో మెరక పనులు, డ్రైనేజీ నిర్మాణంతో పాటు, బస్ స్టేషన్ నిర్మించాల్సి ఉంది. ఆరు నెలలుగా ఆయా పనులు ముందుకు కదలకపోవడంతో ప్రజానీకం పెదవి విరుస్తోంది. అలాగే బస్టాండ్ వద్ద ఆక్రమణల వల్ల డ్రైనేజీలు మూసుకుపోవడం ముంపు సమస్యకు కారణంగా చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ముందుకు కదలని పనులు

ఈ ఏడాది ఫిబ్రవరి 14న బస్ టెర్మినల్‌కు శంకుస్థాపన జరిగింది. తొలిదశలో రూ.5 కోట్ల నిధులూ కేటాయించారు. ఆరు నెలలైనా పనులు ముందుకు కదలడం లేదు. పనులకు టెండర్లు పిలిచి, వాటిని ప్రారంభించే సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం మారడంతో ఈ పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. ఆర్టీసీ అధికారులను దీనిపై అడిగితే, తమ వద్ద సమాచారం లేదని ముక్తసరిగా సమాధానమిస్తున్నారు. అమలాపురం ఎంపీ, ఎమ్మెల్యేలు ఈ బస్‌స్టేషన్ నిర్మాణంపై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

అమలాపురం అత్యాధునిక బస్ స్టేషన్ కాంప్లెక్స్ నిర్మాణానికి గత ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. ప్రయాణికుల అవసరాలు దృష్టిలో ఉంచుకుని ఈ పనులు త్వరితంగా చేపట్టాలి వర్షాకాలంలో బస్టాండ్ ముంపు బారిన పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రభుత్వం ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి.

– కారెం వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వ్యవసాయ కార్మిక సంఘం, అమలాపురం

ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో కోనసీమకే తలమానికంగా నూతన బస్ కాంప్లెక్స్ టెర్మినల్ ఉంటుంది. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్‌లా అత్యాధునిక వసతులతో బస్టాండ్ నిర్మాణానికి నిధులు కూడా కేటాయించారు. ఎన్నికల కోడ్ వల్ల పనులు ముందుకు సాగలేదు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

– ఉండ్రు బాబ్జీ, ప్రయాణికుడు, అమలాపురం